క్లుప్తంగా

పల్లపు భూముల్లో వరినాట్లు

సీతానగరం: మండలంలోని పల్లపు భూముల్లో రైతులు సమకూర్చుకున్న వరినారుతో ఉభాలు నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరిచేను నీట మునగడం వల్ల రైతులు ముందు జాగ్రత్తచర్యగా 15 రోజులు ముందు వరినారు వేయగా అందుబాటులోకి రైతులు దమ్ము పనులు నిర్వహించి నాట్లు వేయడం ప్రారంభించారు, ఈ నేపథ్యంలో బూర్జ, వెంకటాపురం, పెదభోగిలి గ్రామాల్లో ఏటా వరిచేలు నీటమునగడం వల్ల పంట చేతికి రాక ఇబ్బందులు పడుతున్న రైతులు ముందుగా వరినాట్లు వేయడం ఆరంభించారు.

కొట్లాట కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని ఓ పానీపూరీ షాపు వద్ద కొత్తవలస ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో కొట్లాట కేసు నమోదు చేసినట్లు సీఐ కె.మురళీధర్ పేర్కొన్నారు. బాధిత వ్యక్తి కార్పెంటర్‌గా పనిచేస్తూ తన దగ్గర పనిచేస్తున్న యువకుడిని ఒత్తిడికి గురి చేస్తున్నాడన్న కారణంగా ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

ఘనంగా పార్వతీదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, మహిళలు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిలో గల పార్వతీదేవి ఆలయ 44 వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఏటా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కేవీఎస్ పద్మావతి

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అడ్డాపుశీల ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కేవీఎస్ పద్మావతి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఆస్పత్రిలో గల రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేస్తూ గర్భిణుల రిజిస్ట్రేషన్, ఆ.బా ఐడీ క్రియేట్ ప్రక్రియను సక్రమంగా చేయాలని చెప్పారు. అలాగే జననీ మిత్ర దరఖాస్తుల ప్రక్రియ సరళిని పరిశీలించారు.

యోగా డే సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన



యోగాడే అక్షర మాలగా ఏర్పడిన పెదబొండపల్లి హైస్కూల్ విద్యార్థులు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్‌పాఠశాల విద్యార్థులు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంగ్ల అక్షరమాలగా రూపొంది ఆకట్టుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరీశ్వరి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. ప్రాథమిక దశనుంచే యోగా నేర్చుకుని రోజూ విద్యార్థులు తమ దినచర్యలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సింహాచలం, స్టాఫ్ సెక్రటరీ సూర్యనారాయణ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేసి విత్తనాలివ్వాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస, ములగ పంచాయతీల్లో 20ఏళ్లుగా సాగుచేస్తున్న గిరిజనుల భూములకు పట్టాలు మంజూరు చేసి విత్తనాలను సరఫరా చేయాలని సీపీఎం మండల నాయకుడు పి.రాము డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత గిరిజన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేని కారణంగా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కారణంగా గిరిజనులు భూములు పంటలు పండించేందుకు అవకాశం లేకుండా ఎడారులుగా మారే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి ప్రాథమికంగా విత్తనాలు పంపిణీ చేసి అలాగే పట్టాలను మంజూరు చేయాలని కోరారు, ఈ సమస్యపై కలెక్టర్‌కు విన్నవిస్తామని పేర్కొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఆసనాలతో మానసిక, శారీరక ఉల్లాసం
- అవయవాల కదలికతో శారీరక దృఢత్వానికి మేలు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగాసెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పార్వతీపురంటౌన్: యోగా అంటే ఐక్యత్వం. పూర్వ కాలంలో మునులు, ఋషులు పూర్వీకులు అంతా ఆరోగ్యంగా ఉన్నారంటే దానికి కారణం యోగానే అని చరిత్ర చెబుతోంది. చాలా మంది యోగా అంటే వ్యాయామం, కేవలం కొన్ని శరీర భాగాలు కదిలించడం, ఇంకా శ్వాసప్రక్రియ అని మాత్రమే అనుకుంటారు. కానీ నిజానికి యోగా అంటే మానవుడి అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయిక అని గురువులు చెబుతున్నారు. విజ్ఞానశాస్త్రం ప్రకారం యోగా అంటే పరిపూర్ణ జీవనసారాంశ విధానమని, దీనిలో జ్ఞానయోగం, భక్తియోగం, రాజయోగం, కర్మయోగం ఉంటాయని, యోగాసనాలు అంటే రాజయోగ ప్రక్రియలో యోగాలన్నీ సమతౌల్యాన్ని, ఏకత్వాన్ని తీసుకువస్తాయని యోగా గురువులు చెబుతుంటారు.

జిల్లాలో సుమారు 80 యోగా కేంద్రాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 80 యోగా కేంద్రాలు ఉన్నాయి. సుమారు 20వేల మందికి పైగా యోగాసనాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. యోగా శిక్షణ తీసుకోవడం ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, మేధాశక్తి, రోగ నిరోధక శక్తి పొందుతున్నాయని యోగాలో శిక్షణపొందుతున్న వారు చెబుతున్నారు. యోగాసనాల ద్వారా శరీర అవయవాలన్నీ కదిలి ఎంతో ఆరోగ్యంగా ఉన్నామని అంటున్నారు. సూర్య నమస్కారాల యోగాసనాల ద్వారా శరీరంలోని అన్ని అవయవాలు కదిలి ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఆధ్యాత్మిక భావన కలుగుతుందని చెబుతున్నారు. ప్రజలంతా ఉదయం సమయంలో యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువులు సూచిస్తున్నారు.

యోగావల్ల ఉపయోగాలు

- యోగాసనం ద్వారా ఎముకలు దృఢంగా శక్తివంతంగా ఉంటాయి.
- త్రికోణ ఆసనం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- సూర్య నమస్కారాల ద్వారా అధికంగా ఆహారాన్ని తినాలనే కోరిక పోతుంది.
- శవాసనం ద్వారా నిద్రలేమిని తరిమికొట వచ్చు
- వీరభద్ర ఆసనం వల్ల రక్త పోటును తగ్గించడానికి చాలా ఆస్కారాలున్నాయి.
- సూర్యాసనం ద్వారా జీవక్రియను పెంపుదల చేసుకోవచ్చు.
- పద్మాసనం ద్వారా శరీర నైపుణ్యం పెరుగుతుంది.
- శిర్షాసనం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది.
- బలాసనం ద్వారా మతిమరుపు వ్యాధి పోతుంది.
- ధనురాసనం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చు.

యోగా శరీరానికి హెల్త్ ప్యాకేజీ

శరీరం ఒక్కటే కాదు. మానసికంగా, భావోద్వేగాల పరంగా కూడా సమతుల్యంగా ఉన్నప్పుడే శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లు. ఎంత సంతోషంగా, ఉల్లాసంగా జీవిస్తున్నారనేదే కొలమానం. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం ఇవన్నీ కలిసి ఆరోగ్యానికి ఒక హెల్త్ ప్యాకేజీగా తోడ్పతాయి. ప్రతిఒక్కరూ యోగా చేసి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తున్నాను.

– కె.వెంకటరమణ, యోగాగురువు, సాయి యోగా కేంద్రం, పార్వతీపురం

యోగా రెండు వారాలు చేసి ఆపేది కాదు

యోగా అనేది ఒకటి, రెండు వారాలు, నెలలు చేసి ఆపేసేది కాదు. అది నిరంతర ప్రక్రియ. దీన్ని అభ్యసిస్తున్న కొద్దీ శరీరం తేలికవుతుంది. ఆలోచనలు దారిలోకి వస్తాయి. జీవన శైలిలో మంచి మార్పు వస్తుంది. అంతేకాకుండా శరీరం మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. యోగాచేయడం ద్వారా శరీరానికి, మేధాశక్తికి ఎంతో ఉపయోగం ఉంటుంది.

– అనిల్ శర్మ, యోగా గురువు, శర్మ యోగాసెంటర్, పార్వతీపురం

యోగాసనాలతో పూర్తి ఆరోగ్యం

జాతి, మత కులం వంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరు యోగాలో శిక్షణ పొందుతున్నారు. యోగా చేయడం వల్ల శరీరమంతా దృఢంగా ఉంటుంది. యోగా చేయడం వల్ల మానవుడి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. యోగా ద్వారా మేధాశక్తి పెరగడమే కాకుండా మంచిమార్గంలో నడిచే ఆలోచనలు వస్తుంటాయి.

–అధికారి సింహాచలం, యోగా గురువు, నారాయణ యోగా కేంద్రం, పార్వతీపురం

డీపట్టా గల వారసులకు పట్టాలివ్వాలి

- సీపీఎం డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు వేణు

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 1లో ఒకే విస్తీర్ణంలో ఉన్న 16 ఎకరాలకు డీపట్టాలున్న భూమి గల ఎస్సీ రైతులు (లబ్ధిదారులు) వారసులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బగ్గందొరవలస రెవెన్యూలోని సర్వే నంబర్ 1లో సబ్‌డివిజన్ 1 నుంచి 20 వరకూ ఉన్న డీపట్టా మెట్టభూమిని మండల దళిత, వ్యవసాయ కూలీ సంఘం నాయకులు ఆర్.రాము, ఎం నాగరాజులతో కలిసి శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బగ్గందొరవలసలో నిరుపేదలైన 22 దళిత,గిరిజన కుటుంబాలకు 1972లో సర్వే నంబర్ 1లో రెవెన్యూ శాఖ సుమారు 16 ఎకరాల విస్తీర్ణాన్ని గుర్తించి లబ్ధిదారులకు డి పట్టాలిచ్చిందన్నారు. అప్పటి నుంచి సాగుచేస్తున్నా వారికి హక్కులు కల్పించకపోవడంతో ప్రస్తుతం రుణాలు పొందలేక పోతున్నారని అప్పట్లో పట్టాలు పొందిన వారు మృతి చెందడంతో వారి వారసులకు హక్కు పత్రాలు ఇవ్వాలని పలుమార్లు పార్టీ పరంగా వినతి పత్రాలిచ్చినా ఫలితంలేకపోయిందన్నారు. ఆ భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్‌కు విక్రయించాలని కొంతమంది ఆక్రమణ దారులు చూస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లాలో భూముల సమస్యలతో ఉన్న ఎస్సీ, ఎస్టీల కుటుంబాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు పేర్కొంటూ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాలిపోయిన స్మార్ట్‌మీటర్



కాలిపోయిన స్మార్ట్‌మీటర్‌ను చూపిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం: బిగించిన కొద్దిరోజులకే స్మార్ మీటర్ కాలిపోయిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బీవీ రమణ, జీవీ రమణలు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని రాయగడ రోడ్డు సమీపంలో మెకానిక్ షాపులో కాలిపోయిన స్మార్ట్‌మీటర్‌ను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ఆదాని స్మార్ట్ మీటర్లను టీడీపీ వ్యతిరేకించిందని, అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్‌మీటర్లను బలవంతంగా ప్రజలకు అంటగడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, నాసిరకంగా ఉన్నాయని, అనేక ప్రమాదాలకు కారణంగా ఉన్నాయని పరిశీలనలో తేటతెల్లమైనప్పటికీ కార్పొరేట్లకు ప్రభుత్వం దాసోహం కావడంతో స్మార్ట్‌మీటర్లను ప్రజలపై రుద్దుతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లారీ లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండని ప్రజలకు పిలుపునిచ్చి ఇప్పుడు ప్రజలకు బలవంతంగా ఎలా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మలుపుల్లో మరమ్మతులు చేయండి



చినబొండపల్లి నుంచి కొత్తపట్నానికి వెళ్లే మలుపు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు



కొత్తపట్నం ప్రారంభంలో ఇలా..



వెంకంపేట మధ్యలో ఉన్న మలుపులో రహదారిపై గుంతలో చేరిన వర్షపు నీరు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల మీదుగా ఒడిశా ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న పార్వతీపురం–కొరాపుట్ రహదారి పనులు ఏడాది కాలంగా నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మలుపుల్లో రహదారిపై ఉన్న గుంతల కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి మలుపుల్లో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ రహదారిపై చినబొండపల్లి నుంచి కొత్తపట్నం వెళ్లేందుకు ఉన్న మలుపువద్ద, వెంకంపేట నుంచి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మలుపుల వద్ద గుంతలు ఏర్పడి వరద నీటితో అంచనా వేయలేని విధంగా ఉందని, త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

గిరిజనులకు తప్పని తాగునీటి కష్టాలు



సెలయేటిలో తాగునీరు తోడుతున్న గిరిజన మహిళ



కొండపై నుంచి కావిడితో తాగునీరు మోస్తున్న గిరిజన యువకుడు

- మోనంగి గ్రామానికి సెలయేటి నీరే గతి

సాలూరు రూరల్: మండలంలోని మోనంగి గ్రామంలో బోరుబావి మరమ్మతుల బారిన పడడంతో ఐదురోజులుగా గ్రామస్తులు కొండపై ఉన్న సెలఏటి నీటిని తాగునీరుగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సెలయేటి నీరు తాగితే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇలాంటి సమయంలో ఎమర్జెన్సీ ప్రాతిపదికన బోరు బావులు మరమ్మతులు చేయాల్సి ఉండగా సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గిరిజనులు మండిపడుతున్నారు. గ్రామంలో 356 మంది గిరిజనులు నివాసముంటున్నారు. వారంతా 5 రోజులుగా సెలయేటి నీటినే తాగుతున్నామని వాపోతున్నారు.

తోటపల్లి కాలువనీరు అందించండి



రైతుల సమస్యలు వింటున్న రైతు సంఘాల నాయకులు

బలిజిపేట: తోటపల్లి కుడికాలువ నుంచి బలిజిపేట మండలంలో సుమారు 1500ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలున్నాయని వాటిని అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.దాసు, నాయకుడు జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు వివిధ గ్రామాల రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందులో భాగంగా తోటపల్లి కుడికాలువ నీరు బలిజిపేట మండలంలోని సుభద్ర, పణుకువలస, శివరాంపురం, చెల్లెంపేట, అరసాడ, వెంగాపురం, మిర్తివలస భూములకు అందేవిధంగా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి సంబంధించిన పనులు గతంలో కొంతవరకు చేశారని అవి ఇప్పుడు నిలిచిపోయాయన్నారు. అదేవిధంగా పెదంకలాం కాలువ ఆయకట్టు సుమారు 9వేల ఎకరాలు ఉందని దానికి సక్రమంగా నీరు అందేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మన్మథరావు, అప్పయ్య, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



విశ్రాంత వీఆర్వోలను సత్కరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలను మరింత విస్తరించేలా రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓ నుంచి ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం అందరిపై ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సేవలు మరింత విస్తృతం చేయాల్సి ఉందన్నారు. ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ప్రజలకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు రెండూ రెండు కళ్లు అని అన్నారు. రెండు శాఖల అధికార సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. అనంతరం సుదీర్ఘకాలం వీఆర్వోలుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వీఆర్వో కృష్ణమూర్తి, కూర్మినాయుడులను పుష్పగుచ్ఛాలు శాలువాలతో ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ సీనియర్ సిటిజన్ ఎస్.హరిగోపాలరావు, సర్పంచ్ జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్‌లు సత్కరించారు. కార్యక్రమంలో సుగర్‌కేన్ సొసైటీ చైర్మన్ ఎస్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు స్థానిక వీఆర్వోలు పి.కుమారస్వామి, ఎం.సింహాచలం, డీటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు నిబంధనలు తప్పనిసరి

- రూరల్ సీఐ గోవిందరావు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ గోవిందరావు, ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని జనహిత పాఠశాల సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి నేతృత్వంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనచోదకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల దృష్ట్యా వాహన చోదకులను అప్రమత్తం చేసేందుకు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కొన్ని నిర్ణీత ప్రదేశాల్లో, గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నప్పుడు, మలుపుల్లో నిర్దిష్ట వేగంతో వెళ్లాలని సూచించారు. అలాగే వాహనాలకు రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాలకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రహదారి ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహన చోదకులకు వివరించారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, వచ్చే నెల 17 వ తేదీ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆఖరి రోజని పేర్కొన్నారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ ఐడీ స్లిప్ ప్రింట్ తీసుకుని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో దగ్గర్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో వారి డిటెయిల్స్ మెరిట్ లిస్ట్‌లో కనబడవన్నారు.మరిన్ని వివరాలకు ఫోన్ 9052508903,8886789002 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పనులు పూర్తి చేయాలి



కాలువలు పూర్తయ్యి నిలిచిపోయిన రోడ్డు పనులు

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని మున్సిపాల్టీ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కాలువల పనులను సంబంధిత మున్సిపల్ అధికారులు పూర్తి చేయాలని స్థానిక వార్డు కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువలు, రోడ్ల నిర్మాణాల కారణంగా తీవ్రస్థాయిలో అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని 29వ వార్డులో గత ప్రభుత్వంలో సమస్యలను గుర్తించి రోడ్లు, కాలువల నిర్మాణానికి పనులు ప్రారంభించగా ఎన్నికల కోడ్ రావడంతో అర్ధాంతరంగా పనులను నిలిపివేశారని, కాలువలు నిర్మించి రోడ్డు వేయకుండా ఉండిపోవడంతో వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై సంబంధిత ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పరిష్కారానికి చొరవ చూపడం లేదని వాపోయారు, తక్షణమే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

తెరుచుకోని పాఠశాలలు



నిమ్మలపాడులో తెరుచుకోని జీపీ పాఠశాల

- విద్యకు దూరంగా 40 మంది గిరిజన విద్యార్థులు
- గిరిజన శాఖ మంత్రి నియోజకవర్గంలో దుస్థితి

సాలూరు రూరల్:

పాఠశాలలు ప్రారంభమై నేటికి వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు మండలంలోని 8 జీపీ పాఠశాలలు తెరుచుకోలేదు. ఈ పాఠశాలల్లో దాదాపు 40 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. దళాయివలస, నిమ్మలపాడు, డీకే వెలగవలస, తాడంగివలస, గొందివలస, పనసవలస గ్రామాల్లో ఇంతవరకు గిరిజన విద్యార్థులు విద్యకు నోచుకోలేదు. గత ఏడాది కూడా పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినంతవరకు పాఠశాలలు పూర్తిగా తెరుచుకోలేదు. ఈ ఏడాదికూడా అదేకోవలో విద్యాశాఖ అధికారులు గిరిజన విద్యార్థుల విద్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. గతంలో కూడా గిరిజన సంఘాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగినంతవరకు కొన్ని పాఠశాలలు తెరుచుకోలేదు. ఈ ఏడాది కూడా గిరిజన విద్యార్థులు విద్య నేర్చుకోవాలంటే ఈ కూటమి ప్రభుత్వంలో గిరిజన సంఘాలు ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు గిరిజనులు వాపోతున్నారు. గిరిజన విద్యకోసం కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న కూటమి నాయకులు గిరిజన శాఖమంత్రి నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల విద్యకు ఆదిలోనే నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాకల్లోనే పాఠశాలలు

ఒక వైపు పాఠశాలలు తెరుచుకోవడం లేదని పిల్లలు తల్లిదండ్రులు వాపోతుంటే మరోవైపు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడమే కాకుండా కనీసం పాఠశాల భవనం కూడా లేక చిన్న పాకలోనే పాఠాలు చెప్పే పరిస్థితి గిరిజన శాఖామంత్రి నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల దుస్థితిని తేటతెల్లం చేస్తోంది. నిమ్మలపాడులో పాఠశాల భవనం లేకపోవడంతో చిన్న తడకలతో ఒక చెట్టుకింద విద్యార్థులు పాఠాలు నేర్చుకోవాల్సి వస్తోంది.



ఉపాధ్యాయులు లేక ఇళ్లకే పరిమితమైన విద్యార్థులు

ఉపాధ్యాయులను నియమించండి



ఉపాధ్యాయులను వెంటనే నియమించండి. నాలుగు అక్షరాలు నేర్చుకునే వయసులో ఉపాధ్యాయులు లేక పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. గత ఏడాది కూడా ఇదే విధంగా పాఠశాలలు ఆలస్యంగా తెరిచారు. మళ్లీ ఈ ఏడాదికూడా ఇప్పటివరకు తెరవలేదు. ఇంకా ఎన్నిరోజులు పడుతుందో పాఠశాలలో విద్యార్థులు చదువు నేర్చుకోడానికి.

గెమ్మెల ప్రసాద్ నిమ్మలపాడు గ్రామం